క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



పిడుగురాళ్ల: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సహించేది లేదని ఏవో శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు స్టాక్, సేల్స్ రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహణలో ఉంచాలన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేస్తే దుకాణదారుడి నుంచి రసీదు ఖచ్చితంగా తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

సీపీఐ విరాళాల సేకరణ



పిడుగురాళ్ల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ నాయకులు పట్టణంలో గురువారం విరాళాల సేకరణ చేపట్టారు. గురజాల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు షేక్ హసన్, అక్కినపల్లి బాలయ్య, షేక్ కరిముల్లా, కృష్ణానాయక్, సుజాత, వంగూరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



మాచర్ల: ఆగస్టు 3న ప్రారంభమైన 40 రోజుల ఉపవాస ప్రార్థనలు ముగిశాయని మరనాత చర్చి పాస్టర్ వై.ఎలీషా, పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపవాస ప్రార్థన చేసిన ప్రతి ఒక్కరికి ప్రభువు ఎల్ల వేళలా అండగా ఉంటారన్నారు. పాస్టర్లు సుందరరావు, పి.ప్రభుదాసు, యెహోషువా, విజయబాబు, సంఘ పెద్దలు అంజి, పి.చెన్నయ్య, దానియేలు పాల్గొన్నారు. ప్రేమ విందు అందించారు.

అన్నదానం



మాచర్ల: సొసైటీ కాలనీలోని శ్రీ సత్య సాయి బాబా విద్యా విహార్ నిర్వాహకులు అనిల్ కుమార్, జక్కా శ్రీనివాస్ గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, పట్టణంలోని నిరు పేదలకు 300 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు.

సేంద్రియ సాగుపై రైతులను చైతన్యపరచాలి

మాచర్ల: సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చనే విషయంపై ప్రతి రైతుకు అవగాహన కలిగించే బాధ్యత, యూనిట్ ఇన్‌చార్జిల కమ్యూనిటీలపై ఉందని, డివిజనల్ ఏబీసీఎస్‌ఎఫ్ అధికారి మేరీ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్‌లోని 8 యూనిట్లకు చెందిన సభ్యులనుద్దేశించి మాట్లాడారు. కమ్యూనిటీ న్యాచురల్‌కు చెందిన సభ్యులందరూ సేంద్రియ ఎరువుల ద్వారా పంటల దిగుబడిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. తమ యూనిట్ పరిధిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, ప్రోత్సహించాలన్నారు. మాస్టర్ ట్రైనీ అధికారి వివేక్, ఎంటీలు ఎస్.నాగరాజు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం అందించాలి

మాచర్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఈ నెల 20 నాటికి విద్యా శాఖకు హెచ్ఎంలు అందించాలని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25 సమగ్ర సమాచారాన్ని(యుడీఐఎస్ఈ) ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, ఇతర విద్యాభివృద్ధి పనుల వివరాలను హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. మధ్యలో బడి మానేసిన విద్యార్థులను, ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ చదివేందుకు ప్రవేశం పొందవచ్చన్నారు. వారి

ఆర్టీసీ బస్ సర్వీసులు పెంచాలి

చిలకలూరిపేట: ప్రయాణికుల సౌకర్యార్థం చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపునకు వెళ్లే బస్సుల సంఖ్య పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబును గురువారం కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. దీంతోపాటుగా కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం బస్ సర్వీసు నడపాలన్నారు. డీఎం రాంబాబు మాట్లాడుతూ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బి.శ్రీనునాయక్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఊరేగింపు



మాచర్ల: వినాయకునికి ప్రత్యేక అలంకరణ



దాచేపల్లి నారాయణపురంలో రెడ్ల బజార్‌లో ఊరేగింపు



మాచర్ల: కోదండ రామాలయంలో అన్నదానం



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

దాచేపల్లి: నారాయణపురం రెడ్ల బజార్‌లోని వైఎస్సార్ విగ్రహం సెంటరులో వినాయక చవితి సందర్భంగా మండపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సొసైటీ మాజీ సభ్యుడు వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు విష్ణు, వెంకటరెడ్డి, మల్లారెడ్డి పూజలు చేశారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించి, వినాయకుడి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. పొందుగల వద్ద కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. భారీ అన్నదానం చేపట్టారు.

కారెంపూడి: గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి జరిగిన ఊరేగింపులతో కారెంపూడి సందడిగా మారింది. ప్రత్యేక పూజా మండపాలను నుంచి వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి పెద్ద ఎత్తున బాణ సంచా కాలుస్తూ గ్రామోత్సవం జరిగింది. ప్రజలు వినాయకునికి హారతులిచ్చి పూజలు చేశారు. బండి వద్దకు వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సాగర్ కాల్వలో నిమజ్జనం చేసి, గణనాథునికి వీడ్కోలు పలికారు.

సీసీఆర్ కార్డులతో రైతులకు మేలు



మాట్లాడుతున్న ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ప్రభుత్వం అందిస్తున్న రుణ అర్హత కార్డుల వల్ల కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కౌలు రైతులు ఏపీ పంట సాగుదారుల చట్టం–2019పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ–0పంట నమోదుకు ఖచ్చితంగా కౌలు కార్డు ఉండాలన్నారు. పంట ఇన్సూరెన్స్, పంట విక్రయం, రుణాలు పొందడానికి, ప్రభుత్వ పథకాల లబ్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 1,864 మంది రైతులకు సీసీఆర్ కార్డులను అందజేయడం జరిగిందన్నారు.

ప్రకృతి స్ఫూర్తి



విత్తన బంతులతో పర్యావరణవేత్త జాజి, విద్యార్థులు

కారెంపూడి: మండలంలోని పెద కొదమగుండ్ల పాఠశాల విద్యార్థులు గురువారం మొక్కల పెంపకానికి వందలాది విత్తన బంతులు తయారు చేశారు. పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి) పాఠశాలను సందర్శించారు. స్ఫూర్తి పొందిన విద్యార్థులు అప్పటికప్పుడు ఉదయం నుంచి సాయంత్రం వరకు విత్తన బంతులు తయారు చేశారు. అనేక పాఠశాలల విద్యార్థులు ప్రకృతి ప్రేమికులుగా మారుతున్నారని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా విత్తన బంతులు తయారు చేయడంతో పాటు విరివిగా మొక్కలు నాటుతున్నారని అంకారావు సంతోషం వ్యక్తం చేశారు.

బకాయిలు సక్రమంగా వసూలు చేయాలి

నరసరావుపేట డివిజన్ విద్యుత్ అధికారి ఎస్.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసరావు

రొంపిచర్ల: విద్యుత్ బకాయిలు సక్రమంగా వసూలు చేయాలని నరసరావుపేట డివిజన్ విద్యుత్ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక హైవే రోడ్డు పక్కన గల విద్యుత్ కార్యాలయంలో గురువారం నరసరావుపేట రూరల్ సబ్– డివిజన్ పరిధిలో గల రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, ఈపూరు మండలాల పరిధిలో గల విద్యుత్ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నరసరావుపేట డివిజన్ విద్యుత్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూరు శాతం విద్యుత్ రెవెన్యూ వసూలు చేయాలన్నారు. గ్రామాలలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. నూతన సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు వెంటనే సర్వీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం విద్యుత్ బకాయిలు వసూలు, సమస్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వెంకటేశ్వరరెడ్డి, ఆయా మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డవల్లిలో ఇద్దరు యువకులపై కత్తులతో దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- పాత కక్షలు నేపథ్యంలో ఇరు వర్గాల వాగ్వివాదం
- ఏడుగురిపై హత్యాయత్నం కేసు నమోదు



ఏరియా వైద్యశాలలో క్షతగాత్రుడు వెంకటేష్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ సంధ్యారాణి

సత్తెనపల్లి: ఇద్దరు యువకులపై కత్తులతో దాడి జరిగిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వడ్డవల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర రాచమంటి పవన్ కల్యాణ్, కరాటి వెంకటేష్, పగడాల అంజి, జక్కుల బ్రహ్మం ఉన్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి అచ్యుత్, గొల్లపల్లి జీవన్ మద్యం తాగి వేగంగా వచ్చారు. దీంతో ఇక్కడ జనం ఎక్కువగా ఉంటే ఎందుకు అంత వేగంగా వెళ్తున్నారని పవన్ కల్యాణ్ ఇతరులు ప్రశ్నించారు. వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి వెళ్లిపోయిన అచ్యుత్, జీవన్ అర్ధరాత్రి సమయంలో గర్నెపూడి పవన్, గురజాల విజయ్ కుమార్, మల్లెం వెంకటేష్, దాసరి కోటేశ్వరరావు, ప్రవీణ్‌లతో మళ్లీ వచ్చి కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో కర్నాటి వెంకటేష్‌కు ఎడమ చేతి పైన, నుదుటిపై కత్తి పోట్లు పడ్డాయి. రాచమంటి పవన్ కల్యాణ్‌కు రెండు కత్తి పోట్లు దిగడంతో హుటాహుటిన క్షతగాత్రులను పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. క్షతగాత్రుల్లో కరాటి వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరూ గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు గొల్లపల్లి అచ్యుత్, గొల్లపల్లి జీవన్, గర్నెపూడి పవన్, గురజాల విజయ్ కుమార్, మల్లెం వెంకటేష్, దాసరి కోటేశ్వరరావు, ప్రవీణ్‌లపై హత్యాయత్నం కింద పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యా రాణి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన పట్టణంలో కలకలం రేపింది.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక దాడులు



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారులు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పాపాయపాలెం, బెల్లంకొండ, కొత్తపాలెం, మన్నె సుల్తాన్‌పాలెం, న్యూ చిట్యాల, మాచాయపాలెం గ్రామాల్లో మొత్తం 50 బృందాలుగా ఏర్పడి ఏక కాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సూర్యప్రకాశ్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 4,152 సర్వీసులు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. కాగా మాల్ ప్రాక్టీస్, అదనపు లోడుకు సంబంధించి అందులో 116 మందికి రూ.7.34 లక్షల ఫైన్ వేసినట్లు తెలిపారు. ఎవరైనా విద్యుత్ దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీఈఈలు ఎం.రవికుమార్, ఎం.బాబ్జీనాయక్, కె.రవికుమార్, ఏఈలు కె.కోటేశ్వరరావు, చంద్రశేఖర్ ఆపరేషన్ ఏఈ డి.పవన్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాయి బాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం బాబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించింది. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు పంపిణీ చేశారు.

ఇంటింటి జ్వర సర్వే



రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి, వైద్య సేవలు అందించేందుకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు రెంటచింతల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. దోమల బెడద నివారణకు సైడు కాల్వల్లో కిరోసిన్, బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ అధికారులకు సూచించినట్లు చెప్పారు. రెంటచింతల గ్రామంలో మందులు పంపిణీ చేశారు. సూపర్ వైజర్ ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అచ్చంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో తాడువాయి వాగు పొంగిపొర్లింది. సండ్ర తండాకు చెందిన భూక్యా గోపీ నాయక్ కొట్టుకొని పోయి, మూడవ రోజు మృత దేహం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం గోపీ నాయక్ ఇంటికెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మాజీ ఎంపీపీ భూక్యా కృష్ణానాయక్, చల్లగరిక శ్రీనివాసరెడ్డి తదితరులు న్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

నాదెండ్ల: గణపవరం విద్యుత్ సెక్షన్ పరిధిలో మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో విద్యుత్ మీటర్లలో అవకతవకలు, అధికలోడు, అనధికార కనెక్షన్లు గుర్తించి అపరాధ రుసుము రూ.3,36,000లు వసూలు చేశారు. గురువారం గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీపీ సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్ఈ విజయకుమార్ నేతృత్వంలో గుంటూరు టౌన్2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపా రు. అనధికారికంగా అధిక లోడు వినియోగిస్తున్న 60 సర్వీసులను గుర్తించి రూ.2,26, 000లు, మరో నాలుగు సర్వీసుల నుండి రూ.1 లక్ష జరిమానా విధించారు. రాబోవు రోజుల్లో తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. దాడుల్లో డీఈఈలు అశోక్‌కుమార్, గురునాధరావు, ఏఈలు పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యల పరిష్కారానికి కృషి



అన్నం వడ్డిస్తున్న ఎంపీపీ కందుల జాను

దాచేపల్లి: క్రమశిక్షణ కలిగిన విద్యను విద్యార్థులకు అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. మండలంలోని కేసానుపల్లి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహారాన్ని రుచికరంగా తయారు చేసి అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థునులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ నిర్వహణకు నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ఎంపీపీని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.32లక్షల వ్యయంతో కేజీబీవీని అభివృద్ధి చేశారని ఎంపీపీ గుర్తుచేశారు. అదనపు తరగతి గదులకు రూ1.50 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. కేజీబీవీలోని సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ తనిఖీల్లో ప్రిన్సిపల్ అరుణ, సీఆర్పీ అబ్రహం, కందుల జానేసు తదితరులున్నారు.

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించాలి

వినతిపత్రాలు అందజేసిన బడ్జెట్‌వాచ్, మాలమహానాడు నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రభుత్వం త్వరలో ప్రవేశపెడుతున్న 2024–25 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ క్రింద వివిధ పథకాలకు నిధులు కేటాయించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వారి కార్యాలయాల్లో కలిసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. డాక్టర్ చదలవాడ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్, మాల మహానాడు నాయకులు ఉప్పెల జయరావు, దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ సభ్యులు మేడే వెంకట రమణ, గుండాల మాణిక్యరావు వినతి పత్రాన్ని అందజేశారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.1,30,000 రూపాయలు మెరిట్ స్కాలర్ షిప్‌లు పంపిణీ చేయడం జరిగింది. పాఠశాలలో 2023 మార్చిలో 6 నుంచి 10వ తరగతి వరకు జరిగిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి క్రింద రూ.15,000 రూపాయలు, ద్వితీయ బహుమతి క్రింద రూ.12,000 రూపాయలు, అదే విధంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2,500 రూపాయలు, రూ.2,000 రూపాయలు పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు రూ.12,000 రూపాయలు విలువ జేసే బహుమతులు అందజేసినారు. వివిధ క్రీడలలో గెలుపొందిన 90 మంది విజేతలకు రూ.30,000 రూపాయలు విలువ కలిగిన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం

ఈపూరు: బొమ్మరాజుపల్లిలో సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకాన్ని బుధవారం సాయంత్రం పలువురు ధ్వంసం చేశారు. వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాలవారు రాళ్లు రువ్వు కోవడంతో ఆ రాళ్లు తగిలి ఒక మహిళకు, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ప్రస్తుతం గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం పోలీసు లు పికెట్ ఏర్పాటు చేశామని రూరల్ సీఐ ప్రభాకర్, ఈపూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

శావల్యాపురంలో ఆటో చోరీ

శావల్యాపురం: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శావల్యాపురం గ్రామానికి చెందిన దూదెకుల పెద సైదాకు చెందిన ఆటోను కనక దుర్గమ్మ దేవాలయం ప్రధాన కూడలి మార్గంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేశాడు. ఇదే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను చోరీ చేసినట్లు గుర్తించారు. అయితే చోరీకు పాల్పడిన వ్యక్తులు సెంటరులో ఉన్నదుకాణాల్లో మరో చోరీ చేయడానికి ప్రయత్నాలు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఆటో చోరీకు గురైన విషయాన్ని గురువారం స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు సారథ్యంలో ప్రధాన కూడలి మార్గాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిలించారు. పోలీసులు చాలెంజ్‌గా తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో ఇటీవల వరుసగా బైకులు చోరీలకు అవుతున్నాయి. ప్రధాన సెంటరు పార్కింగ్ చేసిన ఆటో చోరీ జరగటంపై ప్రజల్లో తీవ్ర చర్చనీయంగా మారింది.

సమస్యలు పరిష్కరించాలంటూ..



నరసరావుపేట: అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ధర్నాచేసి వినతిపత్రం అందజేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆప్కాస్‌లో పేరు నమోదు చేయాలని, వర్కర్లకు కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వాలని, ఈ ఏడాది చేసిన సమ్మెకాలపు జీతంతో పాటు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, దేవంగి కోటయ్య కుటుంబానికి ప్రమాదబీమా కింద రూ.5 లక్షలు, అతని కుటుంబానికి రెండుసెంట్లు స్థలం, రావిపాడు, లింగంగుంట్ల నుంచి వచ్చి కార్మికులుగా కొనసాగుతున్న వారికి క్యాజువల్ సెలవలు, పండగ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, యోహాను, అచ్చినరసింహారావు, జయంపు శ్రీను, రోశయ్య పాల్గొన్నారు.